# అవరోహణం–ఆరోహణం

సత్యం మందపాటి

# అవరోహణం-ఆరోహణం

ఆరోజు రాత్రి భోజనం చేసి, టీవీ ముందు కూర్చున్న జగన్నాధంతో అంది సుగుణ, "ఇందాక కాలిఫోర్నియా నించి రాధ పిలిచింది" అని.

"ఆఁ! ఏమంది మా బంగారం" అడిగాడు జగన్నాధం. కూతురు దగ్గర్నించి ఫోన్‌కాల్ వచ్చిందంటే మహా సంతోషం జగన్నాధానికి. ఒక్కగానొక్క కూతురు కనుక, అతనికి రాధ మీద వల్లమాలిన ప్రేమ.

ఒక్కక్షణం తటపటాయించి, "ఇన్నాళ్ళనించీ నేను దేని గురించి భయపడుతున్నానో, అది వినాల్సివచ్చింది ఇవాళ!" నెమ్మదిగా అంది సుగుణ.

జగన్నాధం తలపైకెత్తి అదోలా చూశాడు సుగుణని. "చెప్పు!" అన్నాడు.

"తను ఎవర్నో ప్రేమించిందిట. పెళ్ళిచేసుకుంటుందిట"

"దాంట్లో తప్పేముంది? దానికి నచ్చినవాడ్ని అదే ఎంచుకుంటున్నది. ఇంతకీ ఎవరతను?" అడిగాడు.

"అతను వాళ్ళ హాస్పిటల్లోనే, మనమ్మాయితోనే కలిసి పని చేస్తున్న డాక్టర్‌ట. అంతకన్నా ఎక్కువ చెప్పబోతుండగా, తను కాల్‌లో వున్నాననీ, సెల్ ఫోన్ మోగుతున్నదనీ, తను ఆ ఎమర్జెన్సీ అటెండవాలనీ, మళ్ళీ పిలుస్తాననీ చెప్పి ఫోన్ పెట్టేసింది"

ఒక్క క్షణం ఆగి, "ఎవరతను? మనవాడేనా?" అడిగాడు జగన్నాధం.

"అదింకేం చెప్పలేదు" అంది సుగుణ నెమ్మదిగా.

"కనీసం తెలుగు వాడేనా?"

సుగుణ మాట్లాడలేదు.

"ఏమీ తెలుసుకోకుండా నువ్వు ఫోన్‌లో మాట్లాడిందేమిటి మరి? అసలు ఇండియా వాడేనా అని?" అసహనంగా అడిగాడు జగన్నాధం.

"చెప్పానుగా... వేరే వివరాలేమీ చెప్పలేదని... ఆఁ! మాటల మధ్యలో అతని పేరు చెప్పింది. ఆ అబ్బాయి పేరు బాబ్ అని కాబోలు చెప్పింది"

"అంటే విదేశీయుడన్న మాట. కనీసం అమెరికా వాడేనా.... "

తెలీదన్నట్టుగా తల వూపింది సుగుణ.

"అసలు తెల్లవాడా?..... నల్లవాడా?... ఇంకెవడైనా.... " గొణుగుతున్నాడు జగన్నాధం.

సుగుణ కూడా ఒక పక్కన ఆరాటం, రెండో పక్కన ఏవో ఆలోచనలూ మనసులో ఒక విధమైన భయంతో ముసురు తుంటే, మాట్లాడకుండా అతని వేపే చూస్తూ కూర్చున్నది.

జగన్నాథం కూడా ఆలోచనలో పడ్డాడు. తనూ సుగుణా ఈ పెళ్ళికి ఇష్టపడ్డా పడకపోయినా, అమెరికాలోనే పుట్టి పెరిగిన రాధ, అందరు అమెరికన్ పిల్లలలాగానే, తనకి తన భవిష్యత్తుకీ ఏది సరైనదనిపిస్తుందో అదే చేస్తుంది. తను కావాలని ఆ భావాలతోనే పెంచాడు మరి. అలాటిది తనకి ఈ ఆలోచనెందుకిప్పుడు?

అయినా జగన్నాథం ఆలోచనలు మాత్రం ఆగలేదు.

ఎన్నో ఏళ్ళుగా అమెరికాలో స్థిరపడిపోయిన భారతీయులు చాలమంది- అమెరికన్ సంస్కృతికీ, ఇక్కడి జీవనానికీ, మనుష్యులకీ అలవాటు పడిపోయినా ఇలాటి సంఘటలని మిత్రుల అనుభవాలద్వారా ఎప్పుడూ చూస్తూనేవున్నా, అది తమ దాకా వచ్చేసరికీ ఒక్కసారిగా డీలా పడిపోవటం సహజమే. కొంతమంది వెంటనే తేరుకుని తమని తామే సమర్ధించుకుని పిల్లల ఆనందం, భవిష్యత్తు దృష్ట్యా ముందుకు సాగిపోవటం కూడా సహజమే. మనవాడయితే బాగుంటుందన్న భావంతో మొదలైన ఆశ కనీసం తెలుగు వాడయితే చాలనీ, పోనీ ఇండియన్ అయినా ఫరవాలేదు అన్న ఆలోచనదాకా పోతుంది. ఇక వేరే గత్యంతరం ఏమీ లేదని అనిపించిన తర్వాత మనిషి మనసు, నేను - నా అనేఒక ఇరుకైన భావన నించి కొంత విశాలమైన ఆలోచనలకి ఎలా పురులు విప్పుకుంటుందో చూపిస్తుంది.

ఇప్పుడు జగన్నాథం ఆలోచనలు కూడా ఆ అవరోహణ క్రమంలోనే నడుస్తున్నాయి. మనసులో ఇష్టంవున్నా లేకపోయినా, ఈ ఆలోచనా సరళిని నడిపించేది ఇక వేరే గత్యంతరం లేదనే భావన అవచ్చు. ఆ వ్యక్తుల మీద వుండే ప్రేమానురాగాలు కావచ్చు. చాలరోజులు అమెరికాలో వుండి ఆ విశాల దృక్పథం చూస్తున్న వాతావరణ విశేషాలు కావచ్చు. పిల్లల తల్లిదండ్రులకి, తమ పిల్లలు ఎవర్ని పెళ్ళి చేసుకున్నా ఆనందంగా వుండి, చివరికి కథ సుఖాంతం అయితే అంతకన్నా కావలిసిందేముంది.

ఒక గంట గడిచాక రాధ మళ్ళీ ఫోన్ చేసింది. ఈసారి జగన్నాథం మాట్లాడాడు. సుగుణ కూడా అక్కడే వున్న కార్డ్‌లెస్ ఫోన్ తీసుకుంది.

"ఇందాక కాల్ వస్తే ఎక్కువసేపు మాట్లాడలేక పోయాను డాడీ! ఎమర్జెన్సీ రూమ్‌లో వున్నాను. ఇప్పుడు ఇక్కడంతా సర్దుకుందిలే... " అంది రాధ.

రాధ మాటల్లో అలసట కనిపిస్తూనే వుంది.

సాధ్యమైనంత నెమ్మదిగా అడిగాడు జగన్నాథం. "మరీ కష్టపడి పనిచేస్తున్నావురా నువ్వు. మధ్యమధ్యలో కాస్త రెస్ట్ తీసుకుంటూ వుండు. ఏమిటీ.. ఇందాక అమ్మతో ఏదో చెబుతున్నావుట.... "

ఒక్క క్షణం ఆగి అన్నది, "అవును డాడీ! ఎప్పటినించో చెబుదామనుకున్నాను కానీ, అంతా నిర్ధారణ కాకుండా ఎందుకులే అని ఆగాను. ఇవాళ మధ్యాహ్నం లంచ్‌కి వెళ్ళినప్పుడు రెస్టారెంట్‌లో, అందరిముందూ నా కుర్చీ దగ్గర మోకాళ్ళ మీద

కూర్చుని ప్రపోజ్ చేశాడు బాబ్, విల్ యు మేరీ మి? అని. వెంటనే యస్ అనేశాను. అతనంటే నాకూ ఇష్టమే. చాల మంచివాడు. అతనితో ఒక్కసారి మాట్లాడితే మీరూ ఎంతో లైక్ చేస్తారతన్ని. ఐ నో దట్!" అంది రాధ.

జాగ్రత్తగా వింటున్నాడు జగన్నాథం. అతనికి కూతురంటే వల్లమాలిన ప్రేమ అని ముందే అనుకున్నాం కదా. రాధతో ఆయనా, ఆయనతో రాధ తండ్రీ కూతుర్లలాగా కాకుండా మనసు విప్పి ఎంతో దగ్గరి స్నేహితుల్లా మాట్లాడుకుంటారు కనుక, ఆ సంభాషణ ఒక క్రమపద్ధతిలో నడుస్తున్నది.

"అతనంటే నీకు చాల చాల ఇష్టమా? అతనితో నువ్వు జీవితాంతం సుఖంగా వుండగలవని నీకు నమ్మకం వుందా?" అడిగాడు జగన్నాథం.

నవ్వింది రాధ. "దాంట్లో ఏమీ అనుమానం లేదు డాడీ! వుయార్ మేడ్ ఫర్ ఈచ్ అదర్! ఇఫ్ యు సీ హిమ్, యు విల్ ఎగ్రీ విత్ మి" అంది.

"ఇంతకీ ఎవరే ఆ బాబ్... అదే ఆ అబ్బాయి అమెరికనా... తెల్లవాడా... " అడిగింది సుగుణ ఇక ఆగలేక.

"తెల్లవాడూ కాదూ, నల్లవాడూ కాదు" అంది రాధ నవ్వుతూ.

"మరెవరే... ఇండియనేనా.... " అడిగింది సుగుణ.

"ఆహాఁ! ఇండియనే... "అంది రాధ కవ్విస్తూ.

"తెలుగువాడేనా?.... " అడిగింది సుగుణ కుతూహలంతో.

"అవును తెలుగువాడే... అమెరికాలో పుట్టిన తెలుగువాడు.. నాలాగా సరిగ్గా తెలుగు రాని తెలుగువాడు!" నవ్వింది రాధ.

"మనవాడేనా..... " అడగలేక అడిగింది సుగుణ.

"ఎవరు? రాంబాబా.... " పెద్దగా పడీపడీ నవ్వుతున్నది రాధ.

"నేను అతన్ని పెళ్ళి చేసుకుంటే, అతను మనవాడయిపోతాడు కదూ... " అంది ఇంకా పెద్దగా నవ్వుతూ.

ఎంత పెద్దగా నవ్వుతున్నదంటే, రిసీవర్ పట్టుకున్న సుగుణ జగన్నాథంల చెవుల్లో తుప్పు వదిలిపోయింది.

* * *